క్లుప్తంగా

3 నుంచి బడిబాట

తాడూరు: బడిబాట కార్యక్రమం ఈ నెల 3 నుంచి నిర్వహించనున్నట్లు ఎంఈఓ భాస్కర్ రెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొనాలని సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడిబాట కార్యక్రమం గురించి హెచ్‌ఎంలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

సర్జికల్ క్యాంపు గొప్ప అవకాశం

అమ్రాబాద్: అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సర్జికల్ క్యాంపు పేదలకు గొప్ప వరమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కుందమల్లికార్జున్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రజా సమస్యల పరిష్కారంలో కృషి చేయడంతో పాటు ఈ నెల 5, 6 తేదీల్లో ప్రభుత్వ ఆస్పత్రిలో సర్జికల్ క్యాంపు నిర్వహించతలపెట్టడం చాలా గొప్ప విషయమని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి



నాగర్‌కర్నూల్ క్రైం: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాలని నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కిరాణ దుకాణాల యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ప్లాస్టిక్ నిత్య జీవితంలో భాగంగా మారిందని, దానిపైనే పూర్తిగా ఆధారపడ్డామని, ఆ భూతాన్ని తరిమికొట్టి ఆరోగ్యకరమైన జీవనం గడుపుదామని పేర్కొన్నారు. ముఖ్యంగా కిరాణ దుకాణ యాజమానులు తమ దుకాణాలకు వచ్చే ప్రజలకు ప్లాస్టిక్ కవర్లలో సామాన్లను వేసి పంపరాదన్నారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్‌ను నిర్మూలించి ప్లాస్టిక్ రహిత సమాజంగా తీర్చి దిద్దాలని కోరారు. సమావేశంలో మేనేజర్ యాదయ్య, శానిటరి ఇన్‌స్పెక్టర్ మురళితో పాటు కిరాణ దుకాణ యాజమానులు ఉన్నారు.

శిక్షణ తరగతులు విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్ రూరల్: యాదగిరిగుట్టలో జరిగే డీహెచ్‌పీఎస్ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీపతి పిలుపునిచ్చారు. శనివారం శిక్షణా తరగతుల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ ఐడీఏఎస్ అధికారి పీఎస్‌ఎన్ మూర్తి హాజరై కరపత్రాన్ని విడుదల చేశారు. మద్దిలేటి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలి

కోడేరు: ఉపాధిహామీ పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొండ్రావుపల్లిలో కొనసాగుతున్న ఉపాధి హామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో కొనసాగుతున్న ఉపాధిహామీ పథకం పనుల వద్ద తాగునీరు, టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు.

నేడు రక్తదాన శిబిరం

కల్వకుర్తి: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కల్వకుర్తి పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తామని, కార్యక్రమానికి పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలు హాజరు కావాలని విజయ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఆర్డీఓకు వినతి

అచ్చంపేట: బల్మూర్ మండలం మైలారం, కొండనాగుల, బల్మూర్ గ్రామాల మధ్య నిర్మించతలపెట్టిన ఉమామహేశ్వర రిజర్వాయర్‌తో రైతులకు మేలు కంటే నష్టం ఎక్కువగా ఉందని, దీని మార్పు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన వినతి పత్రాన్ని శనివారం ఆర్డీఓకు అందజేశారు. ఈ ప్రాజెక్టుతో 1,600 ఎకరాల భూమి కోల్పోతుంటే.. 3,060 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందని, దీంతో ఎవరికి లాభం ఉందో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించాలన్నారు.

'మల్లురవి విజయం ఖాయం'

కల్వకుర్తి రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డా. మల్లురవి విజయం ఖాయం అని ఎల్లికల్ మాజీ ఎంపీటీసీ రామకృష్ణ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో పార్లమెంట్ సభ్యుడిగా మల్లురవి అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. మల్లురవి మరోసారి ఎంపీగా విజయం సాధించి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తారని అన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



అచ్చంపేటలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి

అచ్చంపేట రూరల్: ఫర్టిలైజర్ దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, లేకుంటే లైసెన్సులు రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని ఆర్డీఓ మాధవి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయాధికారి కృష్ణయ్యతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎరువులు, విత్తనాల నిల్వలను గమనించారు. కాలం చెల్లిన, నకిలీ విత్తనాలు అమ్మినట్లు తమ దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలను విక్రయించాలన్నారు. గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని, కచ్చితంగా రసీదులు తీసుకోవాలన్నారు. ఫర్టిలైజర్ దుకాణాల వద్దకు వచ్చిన రైతులతో ఆర్డీఓ మాట్లాడారు. పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు.

కల్వకుర్తి: పట్టణంలోని ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్ దుకాణాలను శనివారం పోలీస్ అగ్రికల్చర్ అధికారులు సంయుక్తంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువులు, విత్తనాలు స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలు అమ్మితే చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డి, శ్రీలత పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

తాడూరు: మండలంలోని ఇంద్రకల్, ఐతోల్, శిర్సవాడ గ్రామాల్లోని విత్తనాల దుకాణాలను ఏడీఏ టెక్నికల్ అధికారి పూర్ణచందర్‌రెడ్డి, ఏఓ సాయిరమేష్‌కుమార్‌లు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరి రసీదు ఇవ్వాలన్నారు. బిల్లు బుక్కులు, ధరల పట్టికను తెలియజేసే బోర్డులను ఉంచాలన్నారు.

వెల్దండ: మండల పరిధిలోని అజిలాపూర్, బైరాపూర్, వెల్దండ గ్రామాల్లో శనివారం ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్ దుకాణాలను మండల వ్యవసాయశాఖ అధికారిణి మంజుల, ఎస్‌ఐ రవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విత్తనాల ధరలు, ఎన్ని గ్రామాలు, ఎప్పటి వరకు వినియోగించాలో అన్ని వివరాలను రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా దుకాణాల యజమానులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: లూజ్ విత్తనాల పేరుతో నకిలీ విత్తనాలు అమ్ముతున్న వ్యక్తుల సమాచారం వ్యవసాయశాఖ అధికారులకు ఇవ్వాలని తిమ్మాజిపేట ఏఓ కమల్ కుమార్ సూచించారు. శనివారం తిమ్మాజిపేట మండలంలోని ఎదిరేపల్లిలో విత్తనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



బిజినేపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



వెల్దండలో తనిఖీ చేస్తున్న అధికారులు

మున్సిపల్ కార్మికుల నిరసన



వినతి అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

అచ్చంపేట రూరల్: మున్సిపల్ కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకోవడమే కాకుండా సక్రమంగా వేతనాలు ఇవ్వడం లేదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్, కార్మికులు ఆరోపించారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. శనివారం అచ్చంపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయంలోని తహసీల్దార్ రాములుకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడారు. పెండింగ్‌లోని ఏప్రిల్, మే నెల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్‌లో రావాల్సిన వేతనాల్లో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో కోతలు విధించారని కార్మికులు ఆరోపించారు. ఒక్కో కార్మికుడికి రూ.14 వేల నుంచి రూ.15 వేలు రావాల్సి ఉండగా.. రూ.8 వేలు, 9, 10, 11 వేలు ఇలా కార్మికుల ఖాతాల్లో జమ చేశారన్నారు. ఒక్కో కార్మికుడు సుమారు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. కొందరి కార్మికుల వద్ద డబ్బులు తీసుకుని ఇష్టానుసారంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌ను వివరణ కోరగా.. కార్మికుల హాజరు విషయంలో వ్యత్యాసాలను గుర్తించామన్నారు. పూర్తి స్థాయి విచారణ చేపడుతున్నామన్నారు. కాగా ఏప్రిల్ వేతనాలు పూర్తి స్థాయిలో ఇవ్వకుంటే జూన్ 2 నుంచి సమ్మె చేపడుతామని కార్మికులు హెచ్చరించారు. ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మల, మున్సిపల్ కార్మికులు సాయిలు, శంకర్, హుస్సేన్, పాండు, కృష్ణ, మహిళా కార్మికులు కృష్ణమ్మ, బాలమ్మ, అంజమ్మ, చంద్రమ్మ, పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఆకాంక్ష నెరవేరుస్తాం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: అమరవీరుల ఆకాంక్షలకు భిన్నంగా గతంలో పాలన సాగిందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం అచ్చంపేటలోని ఎమ్మెల్యే నివాసంలో తెలంగాణ ఉద్యమకారులతో కలిసి సమావేశం నిర్వహించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో అమరవీరుల కుటుంబాలను, ఉద్యమకారులను సన్మానిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు వందలాది అమరులు ప్రాణాలు అర్పించారని, వారి ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చనుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. అమరుల కుటుంబ సభ్యులు, ఉద్యమకారులు, పలువురు హాజరుకావాలని కోరారు. కౌన్సిలర్ గౌరీశంకర్, వెంకటేశ్వరశర్మ, రాజేందర్, కాశన్నయాదవ్, నాసరయ్య, మహబూబ్‌అలీ, మల్లికార్జున్, నిరంజన్ పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో ఉచిత శస్త్రచికిత్స

మన్ననూర్: నియోజకవర్గంలో ఉచితంగా 24 రకాల శస్త్ర చికిత్సలు చేయించడం నా అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం మన్ననూర్‌లో మాట్లాడారు. నల్లమల ప్రాంతంలోని బడుగు బలహీన వర్గాలకు ఆరోగ్యపరమైన సాయం అందించడం కోసం ఈ నెల 5, 6 తేదీల్లో ఉచిత శస్త్ర చికిత్స చేసి మందులు అందజేస్తామని చెప్పారు. అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభు(9440787488) జనరల్ సర్జన్, డాక్టర్ మహేష్ 9553996066 లను సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

అమరవీరులకు ఘన నివాళి



తెలకపల్లిలో కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తెలకపల్లి: తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళి అర్పించారు. రాష్ట్రం అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం రాత్రి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు భారీ ఎత్తున కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి నెహ్రూ చౌరస్తా వరకు అమరవీరులకు నివాళి అర్పిస్తూ.. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ.. నెహ్రూ చౌరస్తాకు చేరుకున్నారు. మానవహారంగా ఏర్పడి అమరవీరులకు నివాళి అర్పించారు. బీఆర్‌ఎస్ నాయకులు మాజీ గ్రంథాలయ చైర్మన్ హనుమంతురావు, రమేష్, లక్ష్మమ్మ, సత్యనారాయణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల హక్కుల కోసం పోరాటం



మాట్లాడుతున్న మురళి

కల్వకుర్తి రూరల్: పద్మశాలీలు అంతా ఐక్యమత్యంతో ఏకమై రాజకీయ రంగంలో రాణించేందుకు అడుగులు వేయాలని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి పిలుపునిచ్చారు. శనివారం కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన పద్మశాలి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జనాభా లెక్కల ప్రకారం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి దిగాలని సూచించారు. రాజకీయాల్లో రాణిస్తేనే సంఘం అభివృద్ధికి కృషి చేసే అవకాశం లభిస్తుందన్నారు. చేనేత రంగానికి అనుకూలించే అంశాలను రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లి పద్మశాలి నిరుపేదలకు ఆసరాగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు స్వరూప, రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, సత్యం, రఘురాంరావు, నాగుల వెంకటేశ్వర్లు, పాండయ్య, రాజేందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కల్వకుర్తికి చెందిన మేకల రాజేందర్‌ను ఎన్నుకున్నారు. శనివారం కల్వకుర్తిలో నిర్వహించిన జిల్లా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మురళి సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. పద్మశాలీల సమస్యలపై పోరాడుతానన్నారు.

పరీక్ష విధానాన్ని వెంటనే రద్దు చేయాలి



వినతి అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పెంట్లవెల్లి: ఆశా వర్కర్లకు పరీక్ష పెట్టే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ కోరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో కలిసి ఆయన జూనియర్ డాక్టర్ పవిత్రకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని అన్నారు. ఇప్పటికే అనేక రకాల ట్రైనింగ్‌లు, అనుభవాలు పొందారన్నారు. అందులో భాగంగా రిజిస్టర్లు రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్ నమోదు చేయడం, జ్వరం, థైరాయిడ్ అని తదితర రకాల జబ్బులను గుర్తిస్తున్నారన్నారు. వీటితో పాటు గర్భిణులకు, బాలింతలకు నిత్యం సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయకుండా, సీనియార్టిని గుర్తించకుండా వీటన్నింటిని పరిగణలోకి తీసుకోకుండా పరీక్షలు పెట్టడం పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీదేవి, మమత, జ్యోతి, ఉనిత, ప్రసన్న, భీమమ్మ పాల్గొన్నారు.

తెలకపల్లి: ఆశా కార్యకర్తలకు పరీక్షలు పెట్టే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఆశా వర్కర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పుష్ప అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జ్ పసియోద్దీన్‌కు ఆశా కార్యకర్తలు వినతి అందజేశారు. ఆశా కార్యకర్తలు మాధవి, చంద్రకళ, పుష్ప, వరలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి చెట్ల నరికివేత



పెద్దకొత్తపల్లి బస్టాండ్‌లో చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో జాతీయ రహదారి 167కె రోడ్డు నిర్మాణం కోసం రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లని తొలగిస్తున్నారు. ప్రస్తుతం పెద్దకొత్తపల్లి బస్టాండ్‌లోని చెట్లు తొలగించడంతో ప్రయాణికులకు నిలువ నీడ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు నిర్మాణం అనంతరం ప్రయాణికులు వేచి ఉండేందుకు కొల్లాపూర్, నాగర్‌కర్నూల్‌కు వెళ్లే బస్సులు నిలుపు స్థలం వద్ద బస్ షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

యూనిఫాం తయారీని గడువులోగా పూర్తి చేయాలి



తాడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన యూనిఫాంల కుట్టును వేగవంతం చేసినట్లు డీఆర్డీఓ ఓబులేష్ అన్నారు. తాడూరు మండలం చర్లటిక్యాలలో ఏర్పాటుచేసిన యూనిఫాం కుట్టు కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈనెల 6వ తేదీలోగా యూనిఫాం తయారీని పూర్తిచేయాలని సూచించారు. మండలంలో 37 పాఠశాలల విద్యార్థులకు సంబంధించి యూనిఫాం క్లాత్ కట్టింగ్ పూర్తి అయ్యిందని తెలిపారు. డీఆర్డీఓ వెంట ఏపీఎం శేఖర్, సీసీలు ఉన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



బిజినేపల్లిలో పూజలో పాల్గొన్న భక్తులు



జూపల్లిలో పాల్గొన్న భక్తులు

బిజినేపల్లి: మండలంలోని పాలెంలో హనుమాన్ జయంతిని భక్తులు కనుల పండువగా నిర్వహించారు. శనివారం ఉదయం ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా పూజలు, అలంకరణ, దూపదీప నైవేద్యాలు సమర్పించారు. స్వామివారికి కుంకుమార్చన, అలయ ఆవరణలో పల్లకిసేవ, డోలోత్సవం, వంటి పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి, రఘునందన్‌రావు, గోపాల్, గాడి సురేందర్, గోపాలస్వామి, విట్టల్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని రాజవీధిలోని హనుమాన్ అలయంలో, వరిదేల హనుమాన్ ఆలయంలో శనివారం హనుమాన్ విగ్రహానికి అభిషేకాలు, ఆకు పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రమ్య నాగరాజు దంపతులు రాజవీధి హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో హోమం

చారకొండ: మండలంలోని జూపల్లిలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం వద్ద గ్రామానికి చెందిన రంగినేని కిరణ్‌కుమార్ రావు సత్యవతి, రాజేశ్వర్ రావు రాజేశ్వరి ఆధ్వర్యంలో దేవాలయం వద్ద భక్తిశ్రద్ధలతో యజ్ఞం నిర్వహించారు. వేదపండితులు రామశర్మ, కార్తిక్ మంత్రోచ్చరణలతో హోమం పూర్తిచేసి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దలు కృపాకర్ రావు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం హనుమంతుడి జన్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి తమలపాకు పూజలు, వడమాల వెయ్యడంతో పాటు సిందూర ధారణ చేశారు. హనుమాన్ చాలిసా పారాయణం చేశారు.

పెంట్లవెల్లి: పెంట్లవెల్లిలోని మల్లేశ్వరం, జటప్రోల్ గ్రామాల్లో హనుమాన్ జయంతిని నిర్వహించారు. మంచాలకట్టలో నూతన ఆంజనేయస్వామి ఆలయం సంవత్సరం పూర్తి కావడంతో వివిధ హోమాలు నిర్వహించి అనంతరం మంగళహారతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

దోమలపెంట: ఈగలపెంటలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయంలో స్వామి వారికి సుప్రభాత సేవ తదుపరి గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచామృత అభిషేకం, ఆకుపూజ, మన్యుసూక్తంతో హోమం నిర్వహించారు. మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదాన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నాగిరెడ్డి చంద్రశేఖర్, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.



కల్వకుర్తిలో ..



కొల్లాపూర్‌లో..

కార్గో సేవలు ప్రారంభం

తెలకపల్లి: మండల కేంద్రంలో కార్గో సేవలు శనివారం ప్రారంభించినట్లు ఆర్టీసీ కంట్రోలర్ ఎండీ కుద్దూస్, కార్గో ఏజెంట్ బోగరాజుశివ శనివారం తెలిపారు. మండల కేంద్రం నుంచి కార్గో సేవలు ఆర్టీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని, ప్రజలు వివిధ ప్రాంతాలకు చేరవేసే వస్తువులను కార్గో సేవల ద్వారా వినియోగించుకోవాలని కోరారు. కొంత కాలం రద్దైన ఈ కార్గో సేవలు తిరిగి కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పేద విద్యార్థి చదువుకు చేయూత



కల్వకుర్తి రూరల్: మండలంలోని తురుకలపల్లికి చెందిన ప్రజ్ఞ విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ చేయూతనందించారు. తురుకలపల్లికి చెందిన శేఖర్‌కు ఇద్దరు కుమార్తెలు, అందులో ఒకరైన ప్రజ్ఞ ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థిక స్తోమత ఇబ్బందిగా మారింది. వారి పరిస్థితిని భారత జాగృతి విద్యార్థి విభాగం జిల్లా కన్వీనర్ గణేష్ ట్రస్ట్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ హైదరాబాద్‌లోని ఆకాష్ జూనియర్ కళాశాలలో శనివారం చేర్పించారు. ప్రజ్ఞ ఉన్నత చదువులకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో దారమోని గనేష్, నాగరాజు, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

లింగాల: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దకొత్తపల్లి ముక్కిడిగుండానికి చెందిన మూడావత్ రాజు, మూడావత్ సేవ్యా రెండు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందగా.. రెండు ట్రాక్టర్లను అంబట్‌పల్లిలో పట్టుకున్నట్లు తెలియజేశారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఉప్పునుంతల: మండల కేంద్రానికి చెందిన ఎండపల్లి సురేష్‌రెడ్డి (31) ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ మేరకు శనివారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మృతుడి కుటుంబాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, కట్టా అనంతరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సీహెచ్ శ్రీనివాసులు, శేఖర్‌గౌడ్ ఉన్నారు.

బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడికి..

చారకొండ: బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నకినమోని పెద్దయ్య యాదవ్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర పౌల్ట్రీ ఫాం ఫెడరేషన్ సెక్రటరీ, వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు శనివారం నిమ్స్ ఆస్పత్రిలో పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. పరామర్శించిన వారిలో రాములు యాదవ్, కల్వకుర్తి బీసీ సంఘం నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

పెద్దకొత్తపల్లి: ముష్టిపల్లికి చెందిన సల్వాది రాముడు, సల్వాది చెన్నమ్మలు 10 రోజుల కిందట తాడూరు మండలంలో ఐతోలులో రేకుల షెడ్డు మీదపడి ఇద్దరు మృతిచెందారు. ఇరువురి కుటుంబ సభ్యులుక ఒక్కొక్కరికి రూ.6 వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి చైర్మన్ జగదీశ్వర్‌రావు అందజేశారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



వినతి అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

అచ్చంపేట రూరల్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు డేగ అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం అచ్చంపేటతో పాటు పలు మండలాల ఎంఈఓ కార్యాలయాల్లోని సిబ్బందికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు పాఠశాలలో ఫీజుల దోపిడీ జరుగుతుందని, ఎలాంటి అనుమతి లేకుండా ఏటా 20 నుంచి 30 శాతం ఫీజులను యాజమాన్యాలు పెంచుతున్నాయన్నారు. నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు రాము యాదవ్, రమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠ వార్షికోత్సవం



కేదారేశ్వరాలయంలో..

ఉప్పునుంతల: మండల కేంద్రంతో పాటు శివారు గ్రామాలైన కొత్తరాంనగర్, గట్టుకాడిపల్లి గ్రామాల్లో బొడ్రాయిలను ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు శనివారం వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్థానిక కేదారేశ్వర ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అన్ని దేవతా విగ్రహాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సామూహిక హోమాలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నీటితో బొడ్రాయికి అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అన్నదానం చేపట్టారు. సాయంత్రం బోనాల కార్యక్రమం నిర్వహించారు. మహిళలు అలంకరించిన బోనాలను తలపై పెట్టుకొని కోట మైసమ్మ, బొడ్రాయి, పోచమ్మ ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

లింగాల: మండల పరిధిలోని పద్మన్నపల్లిలో ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో ప్రథమ వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అర్చకులు, రామాచారీ, సుదర్శనాచారీ వేద మంత్రోచ్చరణ మధ్య పలువురు దంపతులు హోమాలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నేనావత్ రాజు, దేవి, సేవ్యానాయక్, చిత్రసేనారెడ్డి, శంకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



లింగాల మండలం పద్మన్నపల్లిలో హోమం